## ప్రత్యంగిరా దేవిని దర్శించుకున్న మంత్రి పొన్నం



మంత్రి ప్రభాకర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ కార్యదర్శి శ్రీనివాస్ స్వర్ణలత దంపతులు

ఎల్‌బీనగర్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆర్కేపురంలోని కుర్తాళం పీఠం శ్రీప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారిని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన, కార్పొరేటర్ రాధధీరజ్‌రెడ్డిలు కూడా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, పున్నా గణేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధు, రాజేశ్వరి రామారావు, వెంకటేశ్వర్లు, ఏసీపీ కృష్ణయ్య, సీఐ సైదులు, అరుణ, సాయికుమార్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యానికి సీఎం సహాయ నిధి భరోసా

● ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సీఎం సహాయ నిధి ఎల్‌ఓసీని బాధితుడికి అందిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కడుపునొప్పితో ఆస్పత్రిలో చేరిన హయత్‌నగర్ పెద్దమ్మకాలనీకి చెందిన ముత్తయ్యకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరు అయిన రూ. 1.50 లక్షల ఎల్‌ఓసీని బాధితుడికి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహాయ నిధి పేదల పాలిట వరం లాంటిదని అన్నారు. పేద ప్రజలు కూడా నాణ్యమైన వైద్యం చేయించుకోవడానికి సహాయ నిధి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు ముద్దగోని సుమన్‌గౌడ్, ప్రతీక్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు జీఎస్ఐకి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాక

మన్సూరాబాద్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నాగోల్ బండ్లగూడలోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ)కి శనివారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి రానున్నట్లు జీఎస్ఐ సంస్థ పీఆర్ఓ డాక్టర్ గంజి మల్లేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆనంద్‌నగర్ చౌరస్తా నుంచి మన్సూరాబాద్ రోడ్డు గుండా జీఎస్ఐ సంస్థ ప్రధాన గేటు వరకు జీఎస్ఐ ఆధ్వర్యంలో ఉదయం 9.30గంటల నుంచి చేపట్టే స్వచ్ఛోత్సవ ర్యాలీని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం జీఎస్ఐ ఆవరణలో సంస్థ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులచే నిర్వహించనున్న పరిసరాల పరిశుభ్రత డ్రైవ్‌లో పాల్గొనడంతో పాటు పారిశుధ్య సిబ్బందికి రక్షణ కిట్లను అందజేస్తారన్నారు.

## కేదార్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

చంపాపేట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానంలోని కేదార్ హనుమాన్ ఆలయంలో ఆలయ చైర్మన్ ఈదులకంటి సత్యనారాయణరెడ్డి, ఈవో ఎస్.లావణ్య, ధర్మకర్తలు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతల సహకారంతో ఆలయంలో పలు అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేయడంతో ఆలయ ప్రక్షాళన, స్వామి వారికి అభిషేకం, శ్రీ హనుమత్(మన్యుసూక్త)హోమాన్ని పండితులు, అర్చకులు ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో దాతలు ప్రతాప్‌రెడ్డి, అర్చన, జగన్‌రెడ్డి, లక్ష్మి, కిషన్ రాథోడ్, మంజుల, యుగేందర్‌రెడ్డి, ఉమాదేవి, కేశవరెడ్డి, ప్రేమలత, వెంకట్‌రెడ్డి, శైలజ, సంగీత లక్ష్మి, నవీన్, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

## స్వచ్ఛతా హీ సేవతో పరిసరాలు పరిశుభ్రం



మల్లాపూర్‌లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంతో పరిసరాలు పరిశుభ్రంగా మారుతాయని, ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉన్నదని బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్‌సీఐ రోడ్డులోని మల్లాపూర్‌లో డిఫెన్స్ సంస్థలు ఆర్‌సీఐ, డీఆర్డీవో ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ తా హీ సేవ కార్యక్రమంలో ఆమె పాల్గొని, ఆయా సంస్థల అధికారులతో కలిసి చీపురు పట్టి పరిసరాలు శుభ్రం చేశారు. కార్యక్రమంలో డిఫెన్స్ సంస్థల అధికారులు పి.అచ్యుతరామయ్య, లెఫ్టినెంట్ కల్నల్ వీకే రాజు, బి.ప్రభాకర్, ధనేంద్ర త్రిపాఠి, పి.తిరుమల్‌రావు, సనాతన్‌కుమార్, రవీందర్, ప్రభాత్‌కుమార్, బడంగ్‌పేట్ ఏఎంసీ జాన్‌కృపాకర్, ఎస్సై వి.యాదగిరి, మాజీ కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

## సంస్కార కేంద్రంలో పుస్తకాలు పంపిణీ



చిన్నారులకు పుస్తకాలు అందజేస్తున్న సునీతాగౌడ్

సరూర్‌నగర్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీసరస్వతీ విద్యాపీఠం అనుబంధ విద్యాలయమైన విద్యాభారతి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బడంగ్‌పేట్‌లోని గాంధీనగర్ బస్తీలో కొనసాగుతున్న శ్రీసరస్వతీ బాల సంస్కార కేంద్రంలోని చిన్నారులకు శుక్రవారం ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. నాదర్‌గుల్ 9వ డివిజన్ మాజీ కార్పొరేటర్ నిమ్మల సునీతాశ్రీకాంత్‌గౌడ్ ఈ కార్యక్రమంలో పాల్గొని పిల్లలకు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్కార కేంద్రం సేవా సంయోజక్ రచన, విభాగ్ సేవా సంయోజక్ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

## వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

వనస్థలిపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం రెడ్‌ట్యాంక్ సమీపంలోని ప్రసిద్ధ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం మంగళవాయిద్యాలు, సుప్రభాత సేవ, కుంకుమార్చన, మహాలక్ష్మి హోమం, శ్రీవారి కల్యాణం, మహానివేదన, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ, కోచైర్మన్ గణపతి, ఆర్.జగదీశ్‌కుమార్, పాపారావు, కె.సత్తయ్య పాల్గొన్నారు.

## మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశం విజయవంతం




మాట్లాడుతున్న జయప్రద భాయి

ఎల్‌బీనగర్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జయప్రద భాయి, రంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ విద్యా పర్యవేక్షణాధికారి వెంక్యానాయక్‌లు విచ్చేశారు. ఈ సందర్భంగా జయప్రద భాయి మాట్లాడుతూ ప్రభుత్వ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతం పెరగాలన్నా, విద్యార్థులు అత్యధిక మార్కులు పొందాలన్నా అధ్యాపకులతో పా టు తల్లిదండ్రుల సహకారం ఉండాలన్నారు. అనంతరం కళాశాల నిర్వహణలో ఆచార్యులు, బోధనా పద్ధతుల్లో ఉపన్యాసకుల తీరును అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## వెంకటరాజుకు డాక్టరేట్ ప్రదానం

మన్సూరాబాద్ : ప్రముఖ పద్యనాటక రంగస్థల కళాకారుడు చల్లగాలి వెంకటరాజుకు యూఎస్ఏలోని ఫ్లోరిడాకు చెందిన రీసెర్చ్ యూనివర్సిటీ ఫర్ సోసియో ఎకానమిక్ డెవలప్‌మెంట్(ఆర్‌యూఎస్ఈడీ) నుంచి డాక్టరేట్ లభించింది. ఢిల్లీలోని రాడిసన్ బ్లూ విహార్ హోటల్‌లో గురువారం ఇండో గ్లోబల్ లీడర్స్ సమ్మిట్-2025ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన పలు రంగాల్లో నిష్ణాతులైన కళాకారులను గుర్తించిన ఆర్‌యూఎస్ఈడీ వారికి డాక్టరేట్‌తో సత్కరించింది. కాగా తెలంగాణకు చెందిన కళాకారుడు చల్లగాలి వెంకటరాజు పలు నాటక రంగంలో తన నటన, పద్యాలతో చేసిన సేవలను గుర్తించిన సదరు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసి సత్కరించింది. ఈ కళలతో పాటు మూగజీవుల ఆకలి తీర్చడం ఆయన దినచర్య కావడం గమనార్హం.



మహాలక్ష్మి దేవి అవతారంలో ప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారు



మహాలక్ష్మి అవతారంలో దర్శనమిస్తున్న దుర్గాదేవి ఆలయంలోని అమ్మవారు



అమ్మవారి వేషధారణలో సాంస్కృతిక ప్రదర్శన చేసిన చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా



మీర్‌పేట్‌లో దుర్గామాతను దర్శించుకున్న బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్, పార్టీ అధ్యక్షులు భిక్షపతిచారి, ముఖేశ్‌ముదిరాజ్



డిఫెన్స్‌కాలనీలోని హరిహరక్షేత్ర అయ్యప్పస్వామి ఆలయంలో దుర్గామాతకు పూజలు చేస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి

# అమ్మవారికి ప్రణమిల్లి.. ఆశీర్వాదం అందుకుని..

### మహాలక్ష్మిగా అమ్మవారి దర్శనం

మన్సూరాబాద్/వనస్థలిపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వివిధ ప్రాంతాలలో ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఐదో రోజైన శుక్రవారం అమ్మవారు భక్తులకు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, మంగళహారతులు ఇచ్చారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా శుక్రవారం సాయంత్రం నాగోల్ బండ్లగూడ, కొత్తపేట ప్రాంతాల్లో వివిధ మండపాలను సందర్శించిన ఉప్పల అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలోని గణేశ్ ఆలయంలో ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కాలనీవాసులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ధర్మారావుగుప్తా, ప్రధాన కార్యదర్శి పి.వి.కె సోమయాజులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఆర్‌ఎల్ కాలనీలో దేవీశరన్నవరాత్రి వేడుకల్లో దుర్గాదేవిని దర్శించుకుంటున్న కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ తదితరులు



బీజేఆర్ భవన్ వద్ద చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, రాంనర్సింహగౌడ్, శేఖర్, శ్రీనివాస్ తదితరులు



బడంగ్‌పేట్ మునిసిపల్ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ సరస్వతి, ఏఎంసీ జాన్‌కృపాకర్, మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మమత తదితరులు

## చాకలి ఐలమ్మకు ఘన నివాళి

జోన్‌బృందం : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వీరోచితంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని శుక్రవారం పలు ప్రాంతాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ, వివిధ సంఘాల ప్రతినిధులు చాకలి ఐలమ్మ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె పోరాటాలను కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు పాల్గొన్నారు.



బీజేఆర్ భవన్ వద్ద చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, చిలుక ఉపేందర్‌రెడ్డి, పున్న గణేశ్

## ప్రైవేటు టీచర్లకు ప్రభుత్వం అండ



ఉత్తమ ప్రైవేటు ఉపాధ్యాయులకు అవార్డులు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, బొగ్గారపు దయానంద్‌గుప్తా

ఎల్‌బీనగర్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ప్రైవేటు ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రైవేటు ఉద్యోగ సంఘం ప్రైవేటు ఉపాధ్యాయ విభాగం ఆధ్వర్యంలో 'సంపూర్ణ విద్యా సదస్సు, ఉపాధ్యాయ మహోత్సవం-2025'ను ఆర్కేపురం డివిజన్ పరిధి కొత్తపేటలోని బాబుజగ్జీవన్‌రామ్ భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, బొగ్గారపు దయానంద్‌గుప్తాలు విచ్చేసి ప్రసంగించారు. ప్రైవేటు ఉపాధ్యాయులకు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు, కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించేలా సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వివిధ ప్రైవేటు పాఠశాలల్లో ఉత్తమ విద్య, ఉత్తమ వ్యాయామం, క్రీడలు నేర్పించిన ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులకు అవార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంధం రాములు, ప్రైవేటు టీచర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ కార్తీక్, ప్రధాన కార్యదర్శి ఇస్మాయిల్, ప్రైవేటు పాఠశాల యాజమాన్యాల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ రామగిరి ప్రకాష్, సంఘం సభ్యులు చంద్రశేఖర్‌ముదిరాజ్, శ్రీరామ్, నాగార్జున, డీఎం లక్ష్మణ్, రజనికుమార్, రామకృష్ణ, మహిళా సభ్యురాళ్లు అనిత, అంబటి తులసి, మాధవి, సుజాత పాల్గొన్నారు.

## నేడు కొండా లక్ష్మణ్‌బాపూజీ కాంస్య విగ్రహావిష్కరణ

● ముఖ్యఅతిథులుగా మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్

మన్సూరాబాద్ : ఎల్బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఉక్కు మనిషి కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహాన్ని శనివారం ప్రారంభించనున్నట్లు తెలంగాణ బీసీ కులాల సమన్వయ వేదిక అధ్యక్షుడు బొమ్మ రఘురాంనేత, ప్రధాన కార్యదర్శి పెద్ది జగదీష్ పేర్కొన్నారు. కొండా లక్ష్మణ్‌బాపూజీ 110వ జయంతి సందర్భంగా చేపడుతున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ విచ్చేస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలో విశిష్ట అతిథులుగా స్థానిక ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిలతో పాటు ప్రముఖ నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారని వారు పేర్కొన్నారు.

## శివారు వాగుల్లో కొనసాగుతున్న వరద ప్రవాహం

● బాటసింగారం-మజీద్‌పూర్ రోడ్డు చిన్న ఏరులో జారిపడిన ద్విచక్ర వాహనదారుడు

● కాపాడిన స్థానికులు



చిన్న ఏరులో జారిపడిన ద్విచక్ర వాహనదారుడిని కాపాడుతున్న స్థానికులు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరుసగా కురుస్తున్న వర్షాలతో మండల పరిధిలోని పలు వాగుల్లో వరద ప్రవాహం కొనసాగుతుంది. శుక్రవారం బాటసింగారం-మజీద్‌పూర్ రోడ్డులోని చిన్న ఏరులో రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనదారుడు జారిపడ్డారు. వెంటనే అక్కడే ఉన్న మజీద్‌పూర్‌కు చెందిన కొందరు యువకులు వాహనదారుడిని రక్షించి బయటకు లాగారు. గురువారం రాత్రి నుంచి ముసురు కురుస్తుండడంతో వాగుల్లో వరద ప్రవాహం పెరిగినట్లు స్థానికులు తెలిపారు. దీంతో ఆ రోడ్డును మూసివేశారు.



చంపాపేటలోని డీమార్టు ఎదుట నిలిచిన వర్షం నీటిలో ఉన్న వాహనాలు

### చంపాపేట, హస్తినాపురంలలో..

చంపాపేట: చంపాపేట, హస్తినాపురం డివిజన్లలో శుక్రవారం మోస్తారు వర్షం కురిసింది. ఆయా డివిజన్లలోని లోతట్టు కాలనీల్లో రహదారులు జలమయంగా మారాయి. చంపాపేట చౌరస్తాలో సాగర్ ప్రధాన రహదారిపై ఉన్న డీమార్టు ఎదుట వర్షపు నీరు నిలువడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురైనాయి. జీహెచ్ఎంసీ సిబ్బంది రహదారిపై నిలిచిన నీటిని సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టారు.

## మూసీ వెంట హెచ్చరిక బోర్డులు

ఓల్డ్‌మలక్‌పేట : మూసీ పరీవాహక ప్రాంతం వెంట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మూసీ ఉధృతంగా ప్రవహిస్తున్నందున పరిసర ప్రాంత ప్రజలు అటువైపు వెళ్లకుండా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. ఓల్డ్‌మలక్‌పేట శంకర్‌నగర్ వాహెద్‌నగర్ ప్రాంతాల్లో మూసీ వెంట ఇనుపకంచెకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇటీవల ఓల్డ్‌మలక్‌పేట శంకర్‌నగర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి మూసీలోకి దిగి కొట్టుకుపోయాడు. రెండు రోజుల తర్వాత మృతదేహం దొరికింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు జాగ్రత్త చర్యలు చేపట్టారు. మూసీ వెంట సిబ్బంది పర్యవేక్షణ పెట్టారు.



మూసీ నది వెంట హెచ్చరిక బోర్డులు



చెత్త తరలింపును పరిశీలిస్తున్న డీసీ ఎం కె అలీ

## రోడ్లమీద చెత్త వేస్తే కఠిన చర్యలు

ఓల్డ్‌మలక్‌పేట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రోడ్లమీద చెత్త వేస్తే కఠిన చర్యలు ఉంటాయని మలక్‌పేట సర్కిల్ 6 డిప్యూటీ కమిషనర్ ఎం కె అలీ తెలిపారు. శుక్రవారం ఆయన ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో చెత్త తరలింపు పనులను పరిశీలించారు. చెత్త తరలింపులో శానిటేషన్ సిబ్బందికి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లమీద చెత్త వేయకుండా ఉండేందుకు పలు చోట్ల చెత్త కుండీలను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజలు చెత్త కుండీల్లో మాత్రమే చెత్త వేయాలని సూచించారు. కాలనీలు పరిశుభ్రంగా ఉంచేందుకు ఇటీవలె స్మార్ట్ చెత్త బుట్టలు ఏర్పాటు చేశామన్నారు. ఇష్టానుసారంగా చెత్త వేయడంతో వర్షాలు కురుస్తున్నందు వల్ల కుల్లిపోయి దోమలు పుట్టుకొస్తాయని దోమల ద్వారా పలు రకాల వ్యాధులు, జ్వరాలు వస్తాయన్నారు. పరిసరాలను మనం నివసిస్తున్న ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు.

## అమ్మో పెద్దపులి.. గొర్రెను పట్టిందన్న గొర్రెల కాపరి



పెద్దపులి దాడిచేసిన పొట్టేలు మెడకు గాయం చూపిస్తున్న కాపరి ఐలయ్య

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం పరిధిలోని కుమ్మరి గుట్టపై పెద్దపులి కనిపించిందని దేశ్‌ముఖ్ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి దుర్గం ఐలయ్య తెలిపారు. శుక్రవారం ఐలయ్య తన గొర్రెల మందను మేపుట కోసం బాటసింగారం పరిధిలోని కుమ్మరి గుట్టకు తోలుకెళ్లాడు. మధ్యాహ్నం 4 గంటల సమయంలో ముసురు వర్షం కురుస్తుండగా మందలోని ఓ పొట్టేలుపై పెద్దపులి దాడి చేసి లాక్కెళ్తుందని చెప్పాడు. వెంటనే కేకలు వేశానని తన వెంట ఉన్న కుక్కలు మొరగడంతో గొర్రెను విడిచి అక్కడి నుంచి గుట్టలోకి వెళ్లిందన్నాడు. భయంతో వెంటనే అక్కడి నుంచి గొర్రెలను తోలుకుని గుట్ట కిందికి వచ్చేశానని ఆయన పేర్కొన్నారు. కచ్చితంగా అది పెద్దపులి అని ఆయన చెప్పారు. పలు గ్రామాలకు సమీపంలో ఉన్న గుట్టపై పెద్దపులి కనిపించిందన్న ప్రచారంతో ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు. ఈ విషయాన్ని ఫారెస్ట్ అధికారులు సీరియస్‌గా తీసుకోవాలని కోరుతున్నారు.

## మద్యం మత్తులో అంబులెన్స్ డ్రైవర్‌పై దాడి

● అడ్డుకోబోయిన మాంగళ్య షాపింగ్ మాల్ సెక్యూరిటీ గార్డ్‌పై కూడా..

● డ్రైవర్‌తో కాళ్లు మొక్కించుకున్న యువకులు



మద్యం మత్తులో అంబులెన్స్ డ్రైవర్‌పై దాడి చేస్తున్న యువకులు

వనస్థలిపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో యువకులు 102 అంబులెన్స్‌పై దాడి చేసిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం అర్ధరాత్రి కోఠి ప్రసూతి ఆస్పత్రి నుంచి ఇద్దరు బాలింతలను ఇబ్రహీంపట్నం సమీపంలోని నాగిళ్ల మడుగుకు అంబులెన్స్‌లో తీసుకెళ్తున్నారు. బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తా సమీపంలో మాంగళ్య షాపింగ్ మాల్ వద్ద వెనుక నుంచి ఇన్నోవాలో మద్యం మత్తులో వస్తున్న ఇంజాపూర్‌కు చెందిన ముడావత్ ప్రశాంత్(23), అఖిల్(24) హారన్‌కొట్టారు. దారి ఇవ్వలేదని ఆగ్రహించిన వారు అంబులెన్స్‌ను అడ్డగించి డ్రైవర్ యాదయ్యను దుర్భాషలాడి దాడిచేశారు. అడ్డుకున్న మాంగళ్య షాపింగ్‌మాల్ సెక్యూరిటీ గార్డును కూడా చితకబాదారు. అంబులెన్స్‌లో ఇద్దరు బాలింతలు ఉన్నారనీ, తమను వదిలేయాలని డ్రైవర్ బతిమలాడినా యువకులు పట్టించుకోలేదు. తమ కాళ్లు మొక్కితేనే వదిలేస్తామనడంతో డ్రైవర్ యాదగిరి వారి కాళ్లు మొక్కాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోవడంతో యువకులు వాహనాన్ని విడిచిపెట్టి పారిపోయారు. అంబులెన్స్ డ్రైవర్ యాదయ్య ఫిర్యాదు మేరకు ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బతుకమ్మ వేడుకల్లో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జయప్రదబాయ్, జిల్లా పర్యవేక్షణాధికారి వెంక్యానాయక్, ప్రిన్సిపాల్ అనురాధ



రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న న్యాయవాదులు



గడ్డిఅన్నారంలోని అనిబిసెంట్ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, అధ్యాపకులు



దిల్‌సుఖ్‌నగర్‌లోని అవంతి డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాల్లో విద్యార్థులు, అధ్యాపకులు

# ఘనంగా బతుకమ్మ వేడుకలు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బతుకమ్మ వేడుకలను వాడవాడలా ఘనంగా జరుపుకుంటున్నారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ పాటలకు లయబద్ధంగా ఆడుతున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పరిధిలోని బ్రిలియంట్ ఇంజనీరింగ్ కళాశాలలో బతుకమ్మ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తీరొక్క పూలతో బతుకమ్మను తీర్చిదిద్దారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థినులు బతుకమ్మ ఆటపాటలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో బ్రిలియంట్ గ్రూప్ ప్రెసిడెంట్ కసిరెడ్డి మాధవిరెడ్డి, వైస్ చైర్మన్ కసిరెడ్డి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్‌ను బ్రిలియంట్ గ్రూప్ ప్రెసిడెంట్ కసిరెడ్డి మాధవిరెడ్డి ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంబరాలలో మహిళా న్యాయవాదులు బతుకమ్మ పాటలకు లయబద్ధంగా ఆడుతూ సందడి చేశారు. ఈ వేడుకలకు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నంద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రతాప్‌రెడ్డి, కార్తీక్‌లతో పాటు పలువురు న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



బ్రిలియంట్‌లో బతుకమ్మ వేడుకల్లో కళాశాల ప్రెసిడెంట్ మాధవిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు



మీర్‌పేట్‌లో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఏఎంసీ సంరెడ్డి వాగేందర్ రెడ్డి, ఎస్సై నర్సింహ, సమాఖ్య అధ్యక్షురాలు గంగమ్మ